

## కమల్‌హాసన్ నటవిశ్వరూపం 'భారతీయుడు2'

''ఇండియన్ 2' కమల్ అభిమానులకే కాదు, సగటు సినీ అభిమానులందరికీ విందుభోజనం లాంటి సినిమా. ఇందులోని ప్రతి సన్నివేశంలో కమల్ అత్యంతశక్తిమంతంగా కనిపిస్తారు. జూలై 12న ప్రేక్షకులు ఆయన నట విశ్వరూపాన్ని చూస్తారు.' అని దర్శకుడు శంకర్ అన్నారు. 'ఇండియన్' ఫ్రాంచైజీలో భాగంగా ఆయన దర్శకత్వంలో వస్తున్న 'ఇండియన్ 2' సినిమా ఆడియో వేడుక చెన్నయ్ నెహ్రూ స్టేడియంలో వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడారు. కమల్‌హాసన్ మాట్లాడుతూ 'ఎన్నో అవరోధాలను అధిగమించి విడుదలకు సిద్ధమయ్యింది 'ఇండియన్ 2'. అన్ని విషయాల్లో మాకు వెన్నంటి ఉండి ముందుకు నడిపించిన నిర్మాత ఉదయనిధి స్టాలిన్ సహకారం మరిచిపోలేనిది. అందరు మెచ్చేలా 'ఇండియన్ 2' ఉంటుంది.' అని నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సినిమాను థియేటర్‌లో చూడాలని ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని దర్శకుడు లోకేష్ కనకరాజ్ అన్నారు. కాజల్ అగర్వాల్, రకుల్ ప్రీత్‌సింగ్ కూడా ఈ వేడుకలో సందడి చేశారు. బ్రహ్మానందం, శింబు, అనిరుథ్, మౌనీరాయ్ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సినిమా 'భారతీయుడు2'గా తెలుగులో విడుదల కానున్న విషయం తెలిసిందే.



## బాలయ్యకు విలన్‌గా?

'అఖండ 2' స్క్రిప్ట్ పనుల్లో బోయపాటి బిజీబిజీగా ఉన్నారు. ఈ సినిమా కథ పూర్తి శైవత్వం నేపథ్యంలో సాగుతుందని విశ్వసనీయ వర్గాల భోగట్టా. ఇందులో విలన్ పాత్ర అత్యంత శక్తిమంతంగా రాసుకున్నారట బోయపాటి. ఆ పాత్రకోసం బాబీడియోల్, సంజయ్ దత్‌లను కూడా కలిశారట. అయితే.. సంజయ్‌దత్ దాదాపు ఖరారైనట్టు సమాచారం. దక్షిణభారత దేశంలో శైవం ఎంత బలీయంగా ఉంటుందో, ఇక్కడి ఆలయాల ప్రాచుర్యం, వాటి ప్రభావం ఏ స్థాయిలో ఉంటుందో ఈ కథలో వివరించనున్నారట బోయపాటి. బాలయ్య, సంజయ్‌దత్‌ల పాత్రల్ని నువ్వా నేనా అనేలా డిజైన్ చేస్తున్నారట. ప్రస్తుతం కె.ఎస్.రవీంద్ర దర్శకత్వంలో బాలయ్య నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా అయ్యాక. బోయపాటి సినిమా ఉంటుందని తెలుస్తున్నది.



## ఇండియన్ సూపర్ ఉమన్ ఇంద్రాణి

యానియా, అంకిత, అజయ్ ప్రధానపాత్రధారులుగా స్టీఫెన్ పల్లం స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'ఇంద్రాణి'. ఈ నెల 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఇండియన్ సూపర్ ఉమన్ కథగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్టు దర్శక,నిర్మాత తెలిపారు. ఇదొక ఎపిక్ లాంటి సినిమా అని, ఈ సినిమాలోని టాప్ క్లాస్ వీఎఫ్ఎక్స్ వర్క్ ప్రేక్షకులను అలరిస్తుందని ఆయన చెప్పారు. ఇందులో లీడ్‌రోల్‌తో పాటు ఒక రోబో కూడా ఉంటుందని, వారిద్దరి జర్నీ ఆసక్తికరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వందేళ్ల తర్వాత టెక్నాలజీని తెరపై చూపించబోతున్నామని, ఈ సినిమా చూసిన ప్రేక్షకులు ఇంద్రాణితో ప్రేమలో పడిపోతారని దర్శక,నిర్మాత తెలిపారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: చరణ్ మాధవనేని, సంగీతం: సాయికార్తీక్.



## నాని ఓ యావరేజ్ స్టూడెంట్

పవన్‌కుమార్ కొత్తూరి హీరోగా నటిస్తూ స్వీయదర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'యావరేజ్ స్టూడెంట్ నాని'. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణంలో ఉంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాకు సంబంధించిన మోషన్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. పవన్‌కుమార్ మాట్లాడుతూ – 'ఇదొక యూత్‌ఫుల్ ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీ. యాక్షన్‌తో పాటు కుటుంబ భావోద్వేగాలు కూడా ఇందులో మెండుగా ఉంటాయి.' అని తెలిపారు. హీరోహీరోయిన్ల జోడీని మోషన్ పోస్టర్‌లో ఆవిష్కరించారు. శక్తిశ్రీ గోపాలన్ పాడిన పాట నేపథ్యంలో ఈ పోస్టర్ ఆవిష్కృతమైంది. సాహిబా భాసిన్, స్నేహ మాల్వియ, వివియా సంత్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రాజేంద్రన్, సంగీతం: కార్తీక్ బి.కడకండ్ల, నిర్మాణం: శ్రీ నీలకంఠ మహదేవ ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎల్‌ఎల్‌సి బ్యానర్స్.



## అంతబాధలోనూ కామెడీ చేసేదాన్ని

'స్త్రీగా పుట్టడం గర్వపడాల్సిన విషయం. భావి తరాలను తయారు చేసే శక్తి భగవంతుడు స్త్రీకి మాత్రమే ఇచ్చాడు. అలాగే స్త్రీకి మాత్రమే కొన్ని శారీరక సమస్యలు కూడా ఇచ్చాడు. దానిపై నిరంతరం స్త్రీలు పోరాటం చేస్తూనే ఉన్నారు. దీన్ని బాధ్యతగా తీసుకోవాలి' అంటూ తన ఇన్‌స్టాలో పేర్కొన్నది శ్రుతీహాసన్. ఇటీవల స్త్రీల సమస్యలపై ఆమె బోల్డ్‌గా మాట్లాడారు. 'అధిక రక్తస్రావ సమస్యపై నేను చాలా రోజులుగా బాధపడుతున్నాను. కానీ అలాగే షూటింగ్‌ల్లో పాల్గొనేదాన్ని. నా సమస్యను ఎవరికీ తెలియనిచ్చేదాన్ని కాదు. అంతబాధలోనూ కామెడీ సీన్స్‌లో నటించేదాన్ని. లొకేషన్లోనే కళ్లు తిరగడం, కడుపు ఉబ్బరం ఇలా పలు సమస్యలు తలెత్తేవి. ఒక్కోసారి ఆడదానిగా ఎందుకు పుట్టానా? అని బాధ కలిగేది. అయితే.. ఆడపిల్లగా పుట్టేటప్పుడే ఊపిరితో పాటు ఓర్పు, సహనాలను కూడా తోడుగా ఇస్తాడు దేవుడు. ఇంత బాధల్ని భరిస్తాం కనుకే.. ఒక ప్రాణికి జన్మనివ్వగలుగుతున్నాం. ఇది ప్రతి స్త్రీ గర్వపడాల్సిన విషయం.' అంటూ భావోద్వేగానికి గురయ్యింది శ్రుతీహాసన్.

## మనసుల్ని కదిలించిన రాజుయాదవ్



'సినిమా అనేది మనసుల్ని కదిలిస్తే అది నిజమైన సక్సెస్. అలాంటి విజయాన్ని 'రాజు యాదవ్' ద్వారా పొందాను' అంటూ ఆనందం వ్యక్తం చేశారు గెటప్ శ్రీను. ఆయన హీరోగా, కృష్ణమాచారి దర్శకత్వంలో.. కె.ప్రశాంత్, రాజేశ్ కల్లెపల్లి నిర్మించిన 'రాజుయాదవ్' చిత్రం ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే. ఈ సినిమా సక్సెస్‌మీట్‌ను ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా గెటప్ శ్రీను మాట్లాడారు. 'ఈ సినిమా విజయం దర్శకుడిది. భవిష్యత్తులో ఆయన మరెన్నో మంచి సినిమాలు తీయాలి. నాలుగో రోజే మా సినిమా బ్రేక్ ఎవెన్ అవ్వడం ఒక నటుడిగా చెప్పలేని ఆనందంగా ఉంది. నిర్మాతలు హ్యాపీగా ఉంటే పరిశ్రమ బావుంటుంది. ఈ సినిమాకు పనిచేసిన అందరికీ నా ధన్యవాదాలు' అని గెటప్‌శ్రీను చెప్పారు. ఇంకా యూనిట్ సభ్యులంతా మాట్లాడారు.





## పేషన్ ఓ అందమైన ప్రేమకథ

ఫ్యాషన్ డిజైనింగ్ కాలేజ్ నేపథ్యంలో సాగే పేమకథాచిత్రం 'పేషన్'. సుధీష్ వెంకట్, అంకిత సాహ, శ్రేయాసి షా ప్రధాన పాత్రధారులు. ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ అరవింద్ జోషువా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. డాక్టర్ అరుణ్‌కుమార్ మొండితోక, నరసింహ యేలె, ఉమేశ్ చిక్కు నిర్మాతలు. హైదరాబాద్‌లోని పలు కళాశాలల్లో 20రోజులపాటు తొలిషెడ్యూల్ చిత్రీకరణ జరిపారు. త్వరలో రెండో షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఫ్యాషన్ ప్రపంచానికి సంబంధించిన అందమైన ప్రేమకథ ఇదని, ప్రేమ, ఆకర్షణలపై యువతలో ఉన్న అనేక సందేహాలకి సమాధానం ఈ సినిమా అని దర్శకుడు చెప్పాడు. ఈ చిత్రానికి కెమెరా: సురేశ్ నటరాజన్.

## మహారాణి ఉత్పలదేవిగా

శ్రీవిష్ణు కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'శ్వాగ్'. రీతూవర్మ కథానాయిక. మీరాజాస్మిన్ ఓ ప్రత్యేకపాత్ర పోషిస్తున్నది. హసిత్ గోలి దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉంది. ఇప్పటికే మేకర్స్ ప్రమోషన్స్ మొదలుపెట్టారు. అందులో భాగంగానే ఈ ఆదివారం ఇందులో మహారాణి ఉత్పలదేవిగా నటిస్తున్న మీరాజాస్మిన్‌ని పరిచయం చేస్తూ ఆమె ఫస్ట్ లుక్‌ని రివీల్ చేశారు. ఈ లుక్‌లో మీరా మహారాణిగా మెరిసిపోతున్నది. కొంత విరామం తర్వాత మీరాజాస్మిన్ చేస్తున్న తెలుగు సినిమా ఇదే కావడం గమనార్హం. వింజామర వంశానికి చెందిన రాణీ రుక్మిణీదేవిగా ఇందులో రీతూవర్మ కనిపించనుంది. పూర్తి వినోదాత్మకంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కెమెరా: వేదరామన్ శంకర్, సంగీతం: వివేక్ సాగర్.

## కుబేర పోరాటాలు



ఇన్నాళ్లూ కొత్తవాళ్లతో, కాస్త ఇమేజ్ ఉన్న వాళ్లతో సినిమాలు చేసి సక్సెస్‌లు అందుకున్నారు దర్శకుడు శేఖర్ కమ్ముల. ధనుష్ లాంటి సూపర్‌స్టార్‌ని హ్యాండిల్ చేయడం మాత్రం ఆయనకి ఇదే ప్రథమం. పైగా ఇందులో మరో సూపర్ స్టార్ కూడా ఉన్నారు. ఆయనే అక్కినేని నాగార్జున. దాంతో ఈ హైబడ్జెట్ సోషల్ డ్రామాని శేఖర్ కమ్ముల ఎలా తీస్తున్నాడు? అనే విషయంపై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొని ఉన్నది. ఇదిలా వుంటే.. ఈ సినిమా తాజా షెడ్యూల్ హైదరాబాద్‌లో మొదలైంది. ఈ సినిమాకోసం వేసిన భారీ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలను తీస్తున్నారు దర్శకుడు శేఖర్ కమ్ముల. ధనుష్, నాగార్జున ఇద్దరూ ఈ షూట్‌లో ఉన్నారు. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ఇది సాధారణమైన యాక్షన్ సినిమా కాదట. ఇందులో మైథలాజికల్ అంశాలు కూడా ఉంటాయట. సినిమాపేరు 'కుబేర' అని పెట్టారు కాబట్టి, సంపద ప్రసాదించే దైవమైన కుబేరుడు పాత్ర కూడా ఇందులో ఉంటుందని తెలుస్తున్నది. టాకీ పార్ట్ దాదాపు పూర్తికావచ్చింది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. ధనుష్, నాగార్జునల ఫస్ట్‌లుక్ పోస్టర్లను ఇప్పటికే విడుదల చేశారు. శ్రీ వేంకటేశ్వర సినిమాస్ ఎల్‌ఎల్‌పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రై.లిమిటెడ్ పతాకాలపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్ రావు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రంలో రష్మిక మందన్న, జిమ్ సర్భ్ ఇతర కీలకపాత్రలు పోషిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

## వినోదం.. ఉద్వేగం.. వెరసి మనమే



'అమ్మానాన్నల భావోద్వేగాల గురించి కొంచెం విభిన్నంగా చెప్పాలనే ఆలోచన ఎప్పట్నుంచో ఉంది. అది వినోదంగా, ఉద్వేగంగా చెప్పాలనేది నా ఉద్దేశ్యం. అలాగే చైల్డ్ సెంటిమెంట్‌లో ఏదో తెలియని ఇన్నోసెన్స్ ఉంటుంది. ఆ ఇన్నోసెన్స్‌ని కూడా టచ్ చేస్తూ ఓ కథ రాసుకున్నాను. అ కథే 'మనమే'.' అన్నారు దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య. ఆయన దర్శకత్వంలో, శర్వానంద్ కథానాయకుడిగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన 'మనమే' సినిమా ఈ నెల 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీరామ్ ఆదిత్య విలేకరులతో ముచ్చటించారు. 'శర్వానంద్ సింగిల్ సిట్టింగ్‌లో ఈ కథ ఓకే చేశారు. ఇందులో కొత్త శర్వాని చూస్తారు. 'రన్ రాజా రన్'ని మించి వుంటుంది ఇందులో ఆయన ఎనర్జీ.' అని చెప్పారు. ఇంకా మాట్లాడుతూ 'ఇప్పటివరకూ నేను చేసిన సినిమాల్లో ఇదే మోస్ట్ ఫేవరెట్. ఇందులో మా అబ్బాయి విక్రమాదిత్య నటించడం కూడా ఒక రీజన్. ఇందులోని చైల్డ్ కేరక్టర్ కోసం ముందునుంచీ వాడ్నే అనుకున్నాను. నా నమ్మకాన్ని నిలబెట్టాడు విక్రమ్.' అని ఆనందం వెలిబుచ్చారు. 'ఇందులో పదహారు పాటలుంటాయి. కానీ అవి కథను నడిపించేవే తప్ప ఆపేవి కావు. పవన్‌కల్యాణ్ 'ఖుషి' ఆర్‌ఆర్ ఇందులో ఎక్కువగా వినిపిస్తుంది. ఈ సినిమా అనుకున్నప్పుడు విజువల్‌గా ఒక కలర్‌టోన్ ఫిక్స్ అయ్యాను. అది తెరపై చూస్తారు.' అన్నారు శ్రీరామ్ ఆదిత్య. కథానాయిక పాత్రకు కృతిశెట్టి పర్‌ఫెక్ట్‌గా సెట్ అయ్యిందని, బ్రిలియంట్‌గా యాక్ట్ చేసిందని, ఇదొక సర్‌ప్రైజ్ కథాంశంతో తెరకెక్కిన సినిమా అని శ్రీరామ్ ఆదిత్య చెప్పారు.



## ఆ విల్లాలో ఏం జరిగింది?

నగరానికి దూరంగా ఉన్న ఓ ప్రాంతంలోని అందమైన విల్లా అది. ఆ విల్లాలో ఏం జరిగింది? అనే ఆసక్తికరమైన పాయింట్‌తో రూపొందుతోన్న థ్రిల్లర్ 'విల్లా 369'. విజయ్, శీతల్‌భట్ జంటగా నటించారు. సురేశ్ ప్రభు దర్శకుడు. విద్య గణేశ్ నిర్మాత. నిర్మాణం పూర్తిచేసుకున్న ఈ సినిమా సెన్సార్‌కు వెళ్లనుంది. త్వరలో సినిమాను విడుదల చేయాలని మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఉత్కంఠభరితమైన థ్రిల్లర్ కథాంశంతో ఈ సినిమా తెరకెక్కిందని, ఈ సినిమాకు సంబంధించిన రిలీజ్ డేట్‌ను త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు.



## ఆకట్టుకునే యాక్షన్ సీన్స్‌తో దీక్ష

దర్శక, నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ స్వీయదర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'దీక్ష'. కిరణ్‌కుమార్, అలేఖ్యారెడ్డి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి పినిశెట్టి అశోక్‌కుమార్, మదాడి కృష్ణారెడ్డి నిర్మాతలు. నిర్మాణంలో ఉన్న ఈ సినిమా విశేషాలను మేకర్స్ మీడియాకు తెలియజేశారు. ఈ సినిమా టాకీపార్ట్ పూర్తయిందని, వచ్చే వారం ఓ పాట షూట్ చేయబోతున్నామని, ఇందులోని యాక్షన్ సీన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని, నలుగురు హీరోయిన్లను ఈ సినిమా ద్వారా పరిచయం చేస్తున్నామని, త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని, కచ్చితంగా సినిమా విజయం సాధిస్తుందని ప్రతాని రామకృష్ణ గౌడ్ నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా హీరో కిరణ్, సీనియర్ నటి తులసి కూడా మాట్లాడారు.